## క్లుప్తంగా

### చౌడేపల్లె తహసీల్దార్‌గా పార్వతి



చౌడేపల్లె: మండల తహసీల్దార్‌గా పార్వతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హనుమంతు నాయక్ బదిలీపై కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలు ఇచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

### పైపులైనుకు తూట్లు



ఊటూరులో తాగునీటి పైపునకు డ్రిప్ పైపులు వేసుకున్న దృశ్యం

చౌడేపల్లె: ప్రస్తుతం ఆధునిక పద్ధతులను పాటిస్తూ రైతులు బిందుసేద్యం వైపు పరవళ్లు తొక్కుతూ పంటలు సాగు చేసున్న విషయం తెలిసిందే. అదే తరహాలో ఈ చిత్రం చూస్తే అనిపిస్తుంది కదా అనుకుంటే పొరపాటే. చౌడేపల్లె మండలం పెద్దయల్లకుంట్ల పంచాయతీ ఊటూరులో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైనుకు ప్రతి ఇంటికీ ఒకరు డ్రిప్ పైపును ఏర్పాటు చేసుకున్నారు. ఏకంగా 12 రంధ్రాలు వేసి వాటికి పైపులు వేసుకుని వారి ఇంటి వద్దకే నేరుగా నీరు వచ్చేలా చేసుకున్నారు.

### ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట, పెద్దకొండామర్రి, 29 ఏ.చింతమాకులపల్లె, దిగువపల్లె సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న 4 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునేవారు స్థానిక కోడలై ఉండి, 10 ఆపై చదివిన వారై ఉండాలి. వితంతువులు, ఒంటరి మహిళలకు, స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. 25 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా నింపి ఈనెల 17 లోపు అందజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గంగవరం: మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్టు కరెస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి శనివారం తెలిపారు. కళాశాలలో బెంగళూరుకు చెందిన టాలెంట్‌టైజ్ కంపెనీ శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో తమ కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.2.4 లక్షల నుంచి రూ.3.6 లక్షల వరకు వార్షిక వేతనం కింద లభిస్తుందన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపక బృందం అభినందించారు.

### పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత



చికిత్స పొందుతున్న వినీత్‌కుమార్

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు మండలంలోని సింగిరిగుంటకు చెందిన వినీత్‌కుమార్ (23) శనివారం గ్రామ సమీపంలోని గుడి వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పాముకాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వినీత్‌కుమార్‌ను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం పెద్దపంజాణి మండలం శివాడిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

### నేడు చట్టాలపై అవగాహన

పలమనేరు: పట్టణంలోని పీపీఎస్(పలమనేరు పరిరక్షణ సమితి) కార్యాలయంలో నేడు సీనియర్ సిటిజన్స్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యంపిళ్లై శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి లిఖిత ముఖ్య అతిథిగా హాజరై న్యాయ సలహాలను అందిస్తుందని తెలిపారు. బిడ్డల నుంచి నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులకు ఎలాంటి రక్షణ చట్టాలు ఉన్నాయో ఇందులో తెలుస్తుందన్నారు. కార్యక్రమాన్ని సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకోవాలని అందులో సూచించారు.

# అధరహో.. అల్లనేరేడు..

అల్లనేరేడును దివ్యౌషిధిణిగా పరిగణిస్తాం.. ఏ వయసు వారైనా.. ఎవరైనా తినవచ్చు. జూన్, జూలై మాసాల్లో లభించే ఈ సీజనల్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. అయితే ఈసారి ఇంకాస్త డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. రైతులకు, వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అల్లనేరేడు కాయలు తిన్నా.. జ్యూస్ తాగినా ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతారు.

- ప్రకృతి ప్రసాదించిన వరం అల్లనేరేడు
- దివ్యౌషధంగా గుర్తింపు
- ఆరోగ్యానికి మేలు చేస్తాయి
- పుంగనూరు నుంచి చెన్నై, హైదరాబాదు, బెంగళూరుకు ఎగుమతి
- కాసులు కురిపిస్తున్న పంట

చౌడేపల్లె: ఆరోగ్యం బాగుండాలంటే ప్రకృతి ప్రసాదించిన వాటిలో అల్లనేరేడు ప్రధానమైన ఫ్రూట్. ఈసారి మార్కెట్‌లో అల్లనేరేడుకు డిమాండ్ ఏర్పడింది. పంట దిగుబడి సైతం బాగా రావడంతో స్థానిక రైతులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మండలంలోని దిగువపల్లెక్రాసు, కాటిపేరి, ఊటూరు, రాచవారిపల్లె, చిప్పిలేపల్లె, దేవిరెడ్డిచెరువు, కొలింపల్లె, పెద్దూరు, పెద్దకొండామర్రి, చిన్నకొండామర్రి, పాదలపల్లె, గుట్టకిందపల్లె, కరణంవారిపల్లె, మాదంవారిపల్లె, అట్లవారిపల్లె తదితర గ్రామాల్లో రైతులు ఇంటి ఆవరణం, పొలాల గట్లపై పెంచిన చెట్లకు నేరేడు కాయలు విరగ్గాశాయి. మండలం మొత్తం సుమారు మూడు వేల చెట్లు ఉంటాయి. సాధారణంగా అల్లనేరేడు మొక్కలు నాటినప్పటి నుంచి సుమారు నాలుగేళ్లకు కోతకు వస్తాయి. ఈసారి ఒక్కో చెట్టు నుంచి సుమారు 150 కేజీల వరకు చెట్టు పెరుగుదలను బట్టి పంట దిగుబడి వస్తోంది. గ్రామాల్లో గల అల్లనేరేడు చెట్లను వ్యాపారులు ఒప్పందం చేసుకుని కొనుగోలు చేస్తున్నారు. చెట్టు ఎత్తు, పంట దిగుబడిని బట్టి ఒక్కో చెట్టు సుమారు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. రైతులు చెట్లలో పూత రాలిపోకుండా, కాయలు సైజు రావడానికి మందులు పిచికారీ చేశారు. వ్యాపారులు ఆ చెట్లు వద్ద కాపాలాదారులను ఉంచి కాయలను గబ్బిలాలు, చిలకలు, గోరింకలు, కోతుల వంటివి తినకుండా కాపాడుకుంటున్నారు. చెట్టు కొమ్మల్లో నల్లగా మాగిన నేరేడు పండ్లను కోసి గంపల్లో ప్యాకింగ్ చేసి చెన్నై, మదనపల్లె, హైదరాబాదు, అనంతపురం, కడప, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కేజీ నేరేడు రూ.60 నుంచి రూ.80 వరకు ధర పలుకుతోంది. షుగర్ వ్యాధిగ్రస్తులు అల్లనేరేడు కాయలు తింటే ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన కాయలు



చౌడేపల్లెలో విక్రయానికి గంపల్లో ప్యాంకింగ్ చేసిన అల్లనేరేడు

#### గిట్టుబాటు అవుతోంది..



చెట్లలో కాయలను గోసి ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి తీసుకెళ్లి విక్రయించాలంటే కొంచెం రిస్కు తీసుకోవాల్సిందే మరి. మేము పడుతున్న కష్టానికి తగిన కూలీ గిట్టుబాటు అవుతోంది. ఈ సీజనులో అల్లనేరుడు కాయలు చెట్లను గుత్తకు తీసుకోవడం వాటి ద్వారా వచ్చిన లాభంతో సంతోషంగా జీవనం కొనసాగిస్తున్నాం.

– హరీష్, కేతనపల్లె, చౌడేపల్లె మండలం

#### బయట ప్రాంతాల్లోనే డిమాండు



అల్లనేరేడు కాయలకు మన ప్రాంతంలో కంటే చెన్నై, విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాల్లో బాగా డిమాండు ఉంది. ఇక్కడ చెట్లను గుత్తలకు తీసుకుని కాయలు వచ్చేవరకు కాపాలా ఉండి పంట ఒబ్బిడి వరకు మేమే చూసుకుంటాం. పెట్టుబడితో పాటు కష్టానికి తగిన ఫలితం దక్కుతోంది.

– వెంకటరెడ్డి,దిగువచౌడేపల్లి


#### షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు..



అల్లనేరేడు షుగర్ వ్యాధిగ్రస్తులు తింటే దివ్య ఔషధం లాగా పని చేస్తుంది. షుగర్ వ్యాధి వచ్చి బాధ పడే వారు ఈసీజనులో మాత్రమే దొరికే అల్లనేరేడు కాయలు తినాలి. వాటితో పాటు వాటి గింజలను పొడిరూపంలో చేసుకుని తినొచ్చు.

– డాక్టర్ పవన్ కుమార్, వైద్యాధికారి చౌడేపల్లె

### త్వరలో సోలార్ వెలుగులు



మొగిలి ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ స్తంభాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో త్వరలో సోలార్ లైట్లు వెలగనున్నాయి. మొగిలి ఘాట్ ప్రమాదాల నివారణలో భాగంగా సోలార్ లైట్లను ఏర్పాటు చేపట్టారు. దొరచెరువు నుంచి మొగిలి గ్రామానికి వెళ్లే రోడ్డు వరకు సోలా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లు అమర్చారు. త్వరలో వాటికి బ్యాటరీలు అమర్చి లైట్లు వెలిగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

### దేవర ఎద్దుకు వైద్యం



ఎద్దుతో పాటు డాక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

గుడిపాల: దేవర ఎద్దుకు శస్త్ర చికిత్స చేసి కాపాడడంతో గ్రామస్తులు పశువైద్యాధికారి డాక్టర్ సాయిసుధను సన్మానించారు. మండలంలోని ఓ.వెంకటాపురంలో ప్రతి సంవత్సరం దేవరెద్దుకు ఘనంగా పూజలు నిర్వహిస్తుంటారు. ఆ దేవర ఎద్దు క్యాన్సర్ గడ్డతో బాధపడుతోంది. దీనికి సంబంధించి చికిత్సలు చేసిన డాక్టర్ సాయిసుధ క్యాన్సర్ గడ్డను తొలగించారు. ఆ దేవర ఎద్దును కాపాడిన డాక్టర్‌ను గ్రామస్తులందరూ కలిసి సన్మానించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



దిగువపల్లెలో యోగాసనాలు చేస్తున్న తహసీల్దార్ హనుమంతు



పలమనేరు: యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పలమనేరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో శనివారం మెగా యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు విద్యార్థులకు, ప్రజలకు యోగాసనాలను నేర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజమే ధ్యేయంగా అందరికీ యోగా నేర్పిస్తున్నట్లు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని అన్ని సచివాలయాల్లోనూ జరిగింది. ఇందులో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

**చౌడేపల్లెలో..**

చౌడేపల్లె: ప్రతి రోజూ గంట సేపు యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి దోహదపడుతుందని తహసీల్దార్ హనుమంతునాయక్ సూచించారు. శనివారం దిగువపల్లె పంచాయతీ సచివాలయంతో పాటు ప్రాథమిక పాఠశాల ఆవరణలో యోగా దినోత్సవాన్ని పురస్కరించి గ్రామస్తులతో కలిసి యోగా చేయించారు. యువకులు, విద్యార్థులు, గ్రామస్తులకు మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల పీడీ పవన్‌కుమార్ యోగాసనాలు నేర్పించారు.

# జాబ్‌మేళాలో 627 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

కుప్పంరూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో బీసీఎస్ సేవాట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 627 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీసీఎస్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో టెక్ మహీంద్ర, టాటా ఎలక్ట్రానిక్స్, టాటా క్యాపిటల్, హెచ్‌డీఎఫ్‌సీ, టీవీఎస్ మొబైల్స్, అశోక్ లేల్యాండ్, ఫ్లిప్‌కార్ట్ వంటి 30 ప్రముఖ సంస్థలు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ మేళాకు కుప్పం నియోజకవర్గం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్దఎత్తున విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 627 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ డా.సుధాకర్‌బాబు, పీఆర్వో ప్రవీణ్ ఉన్నారు.

# రెస్కోలో బదిలీల రగడ

- సిఫార్సులకు ప్రాధాన్యమిస్తున్న రెస్కో ఉన్నతాధికారులు
- అడిగిన చోటుకు బదిలీ చేసేందుకు పెద్దఎత్తున ముడుపులు
- ఉద్యోగుల మధ్య ఆజ్యం పోసేలా అధికారుల తీరు
- సీనియారిటీని పక్కన పెట్టి జూనియర్లకు ఉన్నత హోదా



రెస్కో కార్యాలయం

కుప్పం: గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో)లో బదిలీల రగడ రేకెత్తింది. నాలుగు మండలాలతో పాటు వి.కోట మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు కుప్పం రెస్కో విద్యుత్ సరఫరా చేస్తోంది. ఈ సంస్థలో మూడేళ్లకోసారి జరిగే బదిలీలు కూటమి నేతల సిఫార్సులకు ప్రాధాన్యమిస్తున్నాయి. మరో వైపు చేతులు తడిపిన వారికి తమకు అనుకూలమైన ప్రదేశాలకు బదిలీ చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**విభేదాలకు ఆజ్యం పోసేలా..**

కుప్పం రెస్కోలో 230 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో వివిధ హోదాల్లో అధికారులు పనిచేస్తున్నారు. గత వారం రోజులుగా సంస్థలో బదిలీలు సాగుతున్నాయి. కుప్పం ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని ఫీల్డ్‌కు బదిలీ చేయడమే కాకుండా రామకుప్పం, శాంతిపురం మండలాలకు బదిలీ చేసినట్లు సమాచారం. దీంతో పాటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య ఉన్న విభేదాలకు ఆజ్యం పోస్తున్నట్లుగా బదిలీ ప్రక్రియ సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూనియర్ కేడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సీనియారిటీని పక్కన పెట్టి ఉన్నత హోదా కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం యూనియన్ పేరిట సామాన్య, చిన్నపాటి ఉద్యోగులపై బదిలీ పేరిట ఒత్తిడి చేస్తూ మానసికంగా వేధనకు గురి చేస్తున్నారు. రెస్కో సంస్థ కేవలం నాలుగు మండలాలకే పరిమితమైనా.. 230 మంది ఉద్యోగులకు స్థానచలనం కల్పించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది..

**నేతల సిఫార్సులు.. చేతులు తడుపుతున్న వైనం**

రెస్కో పరిధిలో మారుమూల గ్రామాలకు వెళ్లకుండా తమకు అనుకూలమైన చోటుకు బదిలీ చేయించుకునేందుకు కొందరు ఉద్యోగులు కూటమి నేతలతో సిఫార్సు చేయించుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలోనే జరిగే ఈ బదిలీలకు నేతల సిఫార్సులు ఏమిటంటూ స్థానికులు మండిపడుతున్నారు. రెస్కో సంస్థ ఏర్పడిన ఈ 40 ఏళ్లలో ఎప్పుడూ ఉద్యోగుల బదిలీలకు రాద్ధాంతం చేయలేదని, ఈసారి కూటమి నేతలు కనుసన్నల్లో రెస్కో సంస్థ బదిలీలు చేయడం దారుణం. అంతేకాకుండా బదిలీల కోసం రెస్కో ఉన్నతస్థాయి అధికారులు వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. మారుమూరు గ్రామీణ ప్రాంతాలకు కాకుండా టౌన్ సమీపంలో గ్రామాలకు బదిలీ చేసేందుకు ఉద్యోగస్తుల నుంచి భారీగా ముడుపులు అందుకున్నట్లు తెలుస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ ఉద్యోగి బదిలీ నిలిపేందుకు పెద్దమొత్తంలోనే వసూలు చేసినట్లు తెలిసింది. రెస్కోలో రోజుకో అవినీతి బాగోతం బయటకు వస్తుండడంపై పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతుంది.

# అక్కడ అలా.. ఇక్కడ ఇలా



అగ్రహారానికి వెళ్లే మార్గంలో వాలిపోయిన 11 కేవీ సరఫరా ఉన్న స్తంభం



మర్రిమాకులపల్లె వద్ద ప్రమాదకరంగా స్తంభానికి అల్లుకున్న తీగలు

చౌడేపల్లె: మండలంలో ట్రాన్స్‌కో అధికారుల తీరు సపరేటుగా మారిందనడానికి చాలా నిదర్శనాలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగితే కానీ స్పందించరా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోయకొండ మార్గంలోని మర్రిమాకులపల్లె ఉర్దూ స్కూల్ సమీపంలో స్తంభానికి పోటీ పడి మరీ తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. అలాగే కొండయ్యగారిపల్లె– అగ్రహారానికి వెళ్లే మార్గంలోని చెరువు కట్టపై 11 కేవీ సరఫరా ఉన్న స్తంభం పూర్తిగా వాలిపోయి వైర్లు కిందకు వేలాడుతూ సరఫరా అవుతున్నా పట్టించుకునే వారు లేకపోయారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

# ఘనంగా సంకటహర చతుర్థి

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో సుందర వినాయకస్వామి దేవాలయంలో శనివారం ఘనంగా సంకటహర చతుర్థి నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలతో పాటు అభిషేకం చేశారు. మహిళలు పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపాటలను పాడారు. అనంతరం వారి మొక్కులను చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు భక్తులకు అందించారు.



సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు







కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణరథోత్సవం శనివారం రాత్రి వైభవంగా సాగింది. ఈ ఉత్సవంలో కోలాట కళాకారులు తమ ప్రతిభతో భక్తులను ఆకట్టుకున్నారు. ఉదయం సంకటహర చతుర్థి వ్రతానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయంలోని క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయం వెలుపల కూడా భక్తులు బారులు తీరారు.

– కాణిపాకం